పడకేసిన 'పల్లె ప్రగతి'

కునికసా గ్రామంలో పాడైపోయిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్

గ్రామాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లను అందజేసింది. ప్రతి రోజూ ఉదయాన్నే ట్రాక్టర్ గల్లిగల్లికి తిరుగుతూ ఇంటింటి నుంచి చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించేవి. దీంతో పాటు హరితహారం మొక్కలను సంరక్షించడానికి ట్యాంకర్‌తో నీళ్లు పట్టేవారు. గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం బాగుండేది. ప్రత్యేకాధికారుల పాలనలో నార్నూర్, గాదిగూడ మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో పరిస్థితి దారుణంగా మారింది. పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లు మూలన పడ్డాయి. దీంతో పారిశుధ్య పనులకు కష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-నార్నూర్, మార్చి 3

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మార్చి 3: గిరిజన విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ బేగంపేట్, రామాంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన గిరిజన బాలికలకు 3, బాలురకు 3 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 1జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్య జన్మించి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. లక్షా యాభైవేలు, పట్టణాల్లో రూ. 2 లక్షలు మించరాదని పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ నెల 14వ తేదీన డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

5న మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 3: సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సకాలంలో మండలస్థాయి అధికారులు నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ప్రయాణ ప్రాంగణం.. ప్రైవేట్ అడ్డా

బజార్‌హత్నూర్‌లో ప్రైవేట్ వ్యక్తులకు అడ్డాగా మారిన ప్రయాణ ప్రాంగణం

బజార్‌హత్నూర్‌లోని బస్ స్టేషన్ (ప్రయాణ ప్రాంగణం) ప్రైవేట్ అడ్డగా మారింది. బస్ స్టేషన్ నిర్మించిన నుంచి నేటి వరకు లోపల బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ఎవరూ అక్కడ ఉండడం లేదు. నిత్యం ప్రయాణికులతో నిండి ఉండే బస్ స్టేషన్ పంచాయితీలు, ప్రైవేట్ వ్యక్తులకు అడ్డాగా మారింది. ఇసుక లోడ్ ఖాళీ చేస్తూ సంచార జాతులకు బాసటగా నిలుస్తోంది. ఇటీవల ఆర్టీసీ అధికారులు నూతన హంగులతో ప్రాంగణం చుట్టు గోడ, ప్రాంగణానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. కానీ మళ్లీ బస్సులు ప్రాంగణంలోకి రాకపోవడంతో ప్రయాణికులు చెట్ల నీడలోనే కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు చొరవతీసుకొని బస్ స్టేషన్‌లోకి బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- బజార్‌హత్నూర్, మార్చి 3

జాతీయ స్థాయిలో రాణించాలి

క్రీడాకారులను సన్మానిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 3 : ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన ఇషాంత్ రెడ్డి, ఓం కిరాజ్ రెడ్డిని ఆదివారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో దయానంద్ రెడ్డి, నారోత్తం రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్, మార్చి 3: ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించే ప్రధానమంత్రి నరేందర్ మోదీ సభకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.700 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదులాపురం: అంగన్‌వాడీ కేంద్రంలో శిశువుకు పోలియో చుక్కలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాధ

ఆదిలాబాద్‌రూరల్: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ గంగాధర్

ఇచ్చోడ: పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి

నిండు జీవితానికి.. రెండు చుక్కలు

ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. రెండు పోలియో చుక్కలు..చిన్నారుల నిండు జీవితానికి శ్రీరామరక్ష అని వారంతా పేర్కొన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ పరిధిలో, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, వివిధ పార్టీల నేతలు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో వైసీ శ్రీనివాస్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్, ఎంపీటీసీ గంగాధర్, సోనాల పీహెచ్‌సీ డాక్టర్ నవీన్‌రెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, నార్నూర్ ఎంపీపీ కనక మోతుబాయి,గాదిగూడ ఎంపీపీ ఆడ చంద్రకళ, ఇంద్రవెల్లి జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, ఇంద్రవెల్లి వైస్ ఎంపీపీ గోపాల్‌సింగ్, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, వైద్యాధికారులు, ఆరోగ్య విస్తరణాధికారులు, వైద్య సిబ్బంది ,ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

– ఎదులాపురం/ఆదిలాబాద్‌రూరల్/బోథ్/ఇచ్చోడ/ఉట్నూర్‌రూరల్/నార్నూర్/భీంపూర్/ఇంద్రవెల్లి/గుడిహత్నూర్/జైనథ్/తాంసి/నేరడిగొండ, మార్చి 3 :

తాంసి: పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ తాటిపెల్లి రాజు

నేరడిగొండలో ఎంపీపీ రాథోడ్ సజన్

ఇంద్రవెల్లిలో జడ్పీటీసీ ఆర్కా పుష్పలత

జైనథ్: భోరజ్‌లో జడ్పీటీసీ తుమ్మల అరుంధతి

ఉట్నూర్‌రూరల్: శ్యాంపూర్‌లో వైస్ ఎంపీపీ బాలాజీ

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి, మార్చి 3 : ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని అడవుల్లో వన్యప్రాణులను వేటాడేందుకు ఎవరైనా ఉచ్చు బిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడవుల్లో చెట్లను నరికిన, అక్రమంగా కలపను దొంగలించిన, అటవీకి నిప్పంటించి ధ్వంసం చేసిన తెలంగాణ అటవీ చట్టం 1967, వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తామని తెలిపారు.

ప్రజాపాలనలో తప్పులు సవరించుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 3: ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రజలు, దరఖాస్తుల్లో ఏమైన తప్పులుంటే సవరించుకోవాలని ఎంపీడీవో బాల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పులు సవరించుకున్న తర్వాత గ్రామ పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులు అందజేయాలని, కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తారని పేర్కొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న చంద్రశేఖర్ తివారి

జైనథ్, మార్చి 3: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి ఆదివారం సందర్శించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం యొక్క విశిష్టతను పూజారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకులు అల్లూరి నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్‌టెక్నిక్ కోర్సులతో త్వరగా ఉపాధి అవకాశాలు

ఉట్నూర్, మార్చి 3: విద్యార్థులు పాల్‌టెక్నిక్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా త్వరగా ఉపాధి పొందే అవకాశాలు ఏర్పాడతాయని ఉట్నూర్ పాల్‌టెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి మురళీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పాల్‌టెక్నిక్ విద్య, దాని ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఇందులో 24 రకాల ఇంజినీరింగ్ కోర్సులు ఉంటుందన్నారు. ఈ కోర్సులు నేర్చుకొని జీవితంలో త్వరగా స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది గజానంద్, లింగేశ్వర్ పాల్గొన్నారు.

5న అంబేద్కర్ భవనంలో సమావేశం

ఇంద్రవెల్లి, మార్చి 3: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల బౌద్ధ ఉపసకులు, ఉపసికులు, యూత్ సభ్యులు హాజరై తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

బోథ్, మార్చి 3 : పొచ్చెర గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మోర నవీన్‌రెడ్డికి స్నేహితులు ఘన స్వాగతం పలికారు. 21 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం మొదటి సారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా 1997-98 సంవత్సరం ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్వాగతం పలికారు. శనివారం రాత్రి ఓపెన్ టాప్ జీపులో గ్రామానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించారు. దేశం కోసం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మోర నవీన్‌రెడ్డిని ఓపెన్ టాప్ జీపుపై తీసుకు వస్తున్న స్నేహితులు

విద్యార్థి దశలోనే కష్టపడాలి

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్, మార్చి 3: విద్యార్థి దశలోనే కష్టపడి చదవాలని సన్‌షైన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్లు షబీర్, రాజగోపాల్ అన్నారు. ఆదివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై అడవి పంది దాడి

ఉట్నూర్ రూరల్, మార్చి 3 : దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన రైతు కొడప జంగు ఆదివారం తన పంట చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. జంగు కేకలు వేయడంతో సమీపంలోని రైతులు వచ్చి కాపాడి స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, ఎంపీటీసీ అనసూయ దవాఖానకు చేరుకొని బాధితుడిని పరామర్శించారు. డాక్టర్ మహేందర్ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

గృహజ్యోతి బిల్లులు అందజేత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 3: గృహజ్యోతి పథకానికి సంబంధించిన విద్యుత్ జీరో బిల్లులను ఆదిలాబాద్‌లోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పర్యటిస్తూ లబ్ధిదారులకు అందజేశారు. ఉచిత బిల్లు రాని లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని వారి కోసం ప్రత్యేకంగా మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ గృహజ్యోతి రసీద్‌తో పాటు ఆధార్, రేషన్ కార్డు జతపరిచి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఉట్నూర్, మార్చి 3: గిరిజన ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ భవనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించనందున, ఏజెన్సీ డీఎస్సీని నిర్వహించిన గిరిజన యువతతో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఇతర జిల్లాలో 317 జీవోతో ఇబ్బందులు పడుతున్నారని ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేడు ఆదిలాబాద్‌కు రానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా కార్యదర్శి రాథోడ్ గజేందర్, ఉట్నూర్ మండలాధ్యక్షుడు జాదవ్ పవన్ లాల్, ప్రధాన కార్యదర్శి పవార్ శేర్‌సింగ్, గౌరవాధ్యక్షుడు ఇందల్‌సింగ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాథోడ్ గణేశ్

ఆదిలాబాద్ రూరల్ సీఐ బదిలీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 3: రాష్ట్రంలో మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ మల్టీ జోన్ వన్ ఐజీపీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఐ సైదారావ్ బదిలీ అయ్యారు. ఆయనను మల్టీ జోన్ వన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ పీసీఆర్ సీఐగా పని చేస్తున్న కె ఫణిదర్ నియమితులయ్యారు.

మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలి

తాడిహత్నూర్‌లో ర్యాలీ తీస్తున్న గ్రామపెద్దలు, మహిళలు, యువకులు

నార్నూర్, మార్చి 3 : నాటు సారా, మద్యం విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మద్యపానం నిషేధించాలంటూ తాడిహత్నూర్‌లో సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు ఆదివారం ర్యాలీ తీశారు. మద్యపాన నిషేధంపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధ గ్రామంగా తాడిహత్నూర్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, సంతోష్‌పటేల్, తానాజీనాయక్, కారోబార్ జాదవ్ పృథ్వీరావు, చౌహాన్ కిశోర్, సూర్యవంశీ, రాథోడ్ గణేశ్, ఆనంద్‌రావ్, సురేశ్, సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవానికి ఆహ్వానం

తాంసి, మార్చి 3 : పొన్నారి గ్రామంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించే అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని పలు సమస్యలు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ గంధం వెంకటరమణ, మాజీ సర్పంచ్ అశోక్, సిరిగిరి దేవేందర్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజస్థాన్ పిల్లలకు పల్స్ పోలియో

ఎదులాపురం, మార్చి 3 : పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. ఆదివారం ఈ కార్యక్రమ పరిశీలనకు అదనపు డీఎంహెచ్‌వో గజానన్ జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి వెళ్తున్న క్రమంలో చేన్లలో పశువులు మేపుకునే రాజస్థాన్ సంచార వృత్తి వారిని గమనించాడు. వాహనం ఆపి అక్కడ ఇద్దరు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశాడు .



పోలియో చుక్కలు వేస్తున్న అదనపు డీఎంహెచ్‌వో గజానన్

మల్టీజోన్ వన్ ఐజీకి స్వాగతం పలికిన ఎస్పీ

ఐజీ ఏవీ రంగనాథ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం,మార్చి 3 : ప్రధానమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తు ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లాకు వచ్చిన మల్టీజోన్ వన్ ఐజీ ఏవీ రంగనాథ్‌కు ఆదివారం ఎస్పీ గౌష్ ఆలం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అన్వర్ ఉల్ హక్ ఉన్నారు.